www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 24 ఏప్రిల్ 2023



మతోన్మాద బిజెపిని తరిమికొట్టాలి

సిపిఎం, సిపిఐ ప్రచారభేరిలో నాయకుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని తరిమికొట్టాలని తిరుపతి జిల్లా సిపిఎం కార్యదర్శి వి. నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం, సిపిఐ ప్రచారభేరి బహిరంగ సభను సూళ్లూరుపేట బస్టాండ్ సమీపంలో సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వి.నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ రంగసంస్థలను బిజెపి నిర్వీర్యం చేస్తున్నాయని, నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజలు ధరలు అమాంతం పెరగడంతో సామాన్యుల బతుకులు మంటలు రాజేస్తున్నాయని అన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగుల జీవితాలు అగాధంలోకి జారుతున్నాయని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, పేదలకు విద్య, వైద్యం అందనంత ఖరీదైపోయిందని, కార్పొరేట్ వ్యాపారంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. షార్‌కేంద్రంలో యూనియన్ పెట్టకూడదని ఈమధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారని యూనియన్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకుల్ని మనం కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వరంగ పరిశ్రమల్ని, ఓడరేవుల్ని ఆఖరికి అన్నంపెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారధత్తం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సిపిఎం నాయకులు బి.పద్మనాభయ్య, సుంకర అల్లయ్య, మనోహరం, సిపిఐ నాయకులు మోదుగుల పార్థసారథి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

టిటిడి కాంట్రాక్టు కార్మికుల ...

మెరుపు సమ్మె

- 2 వేల మంది విధులకు గైర్హాజరై నిరసన
- టైం స్కేలు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని డిమాండ్
- టిటిడి కార్పొరేషన్‌లో విలీనం చేయకుండా డ్రామాలొద్దు
- పెంచకుంటే సరి..జీతాలు కుదిస్తే ఎలా?అంటూ ఆందోళన
- నిరవధిక సమ్మెను కొనసాగిస్తామంటూ ప్రకటన
- కార్మికులకు మద్దతు తెలిపిన సిఐటియు నేతలు



సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి- తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు మెరుపు సమ్మెకు దిగి టిటిడి యాజమాన్యానికి షాక్ ఇచ్చారు. 'అయిన వారికి ఆకుల్లో.. కానివారికి కంచాల్లో' అన్న చందంగా వ్యవహరిస్తూ కొందరిని పర్మినెంటు చేసి, మరి కొందరికి దర్శనం, లడ్డూ కార్డులు ఇచ్చి మాకేమో ప్రస్తుతం ఇస్తున్న జీతాన్ని రూ.11 వేల నుంచి 8 వేలకు కుదిరిస్తారా..? అంటూ 2వేల మంది కార్మికులు ఆదివారం విధులకు గైర్హాజరై తిరుపతిలో నిరసన చేపట్టారు. మున్సిపల్ పార్కు సమీపంలో బైఠాయించి తమకు టైంస్కేలు, గుర్తింపు కార్డులు, లడ్డూ కార్డులు, శ్రీవారి దర్శన సౌకర్యం, స్విమ్స్‌లో ఉచిత వైద్య సేవల్ని ఇచ్చేవరకూ తాము విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. టిటిడి కార్పొరేషన్‌లో విలీనం చేస్తామంటూ తమను మభ్యపెట్టి మోసం చేసిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నుంచి తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకూ సమ్మెను కొనసాగిస్తాంటూ టిటిడి ఆరోగ్యశాఖ అధికారికి కార్మికులు నోటీసులనూ అందించారు. దీంతో అధికారులు సర్ధిచెప్పేందుకు సకలవిధాలా ప్రయత్నిస్తున్నప్పటికీ కార్మికులు మాత్రం వెనుకంజ వేయకపోవడం గమనార్హం. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, టిటిడి కాంట్రాక్టు కార్మికసంఘం అధ్యక్షులు టి.సుబ్రమణ్యం, శ్రామిక మహిళా కన్వీనర్ ఆర్.లక్ష్మి, సిఐటియు నగర కార్యదర్శి వేణు, నాయకురాలు బుజ్జి ఇతర ట్రేడ్ యూనియన్ నాయకులు చిరంజీవి, రాజా, యుగంధర్, ఎన్‌డి శ్రీను, చంద్రశేఖర్‌రెడ్డిలు కార్మికులకు మద్దతు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి, సుప్రీం కోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని టిటిడి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానంలో 18 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాల్లో దశాబ్దాల తరబడి పనిచేస్తున్నారు. అదే పనిచేస్తున్న పర్మినెంటు ఉద్యోగులకేమో దాదాపు 70వేల నుంచి లక్ష రూపాయల వరకు ఇస్తున్నారు. కార్మికులకు మాత్రం కేవలం 11వేలు ఇస్తూ, వారాంతపు సెలవులు గానీ, పిఎఫ్, ఇఎస్‌ఐ, గుర్తింపు కార్డులు, శ్రీవారి దర్శనం, లడ్డూలు, వైద్యసేవలు లాంటి ఎలాంటి సౌకర్యాలనూ అమలు చేయడం లేదు. అధికారంలోకి రాకముందు జగన్ తిరుపతి పర్యటనకు వచ్చిన సందర్భంలో తాను ముఖ్యమంత్రి అయిన మూడునెలల్లో టిటిడి కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంటు చేయిస్తానంటూ హామీ ఇచ్చారు. అయితే సిఎం కుర్చీలో కూర్చుని దాదాపు మూడున్నరేళు గడుస్తున్నా నేటికీ కార్మికులకు ఇచ్చిన హామీని మాత్రం నెరవేర్చలేదు. పైగా టిటిడి అటవీ విభాగంలో 480 మంది కార్మికులు పనిచేస్తుండగా వారిలో 180 మందిని మాత్రమే ఇటీవల రెగ్యులరైజ్ చేశారు. అలాగే కళ్యాణ కట్టలోని కొందరిని క్షురకులకు మాత్రమే పర్మినెంటు చేశారు. అయితే దాదాపు మూడు దశాబ్దాలుగా వేంకటేశ్వర స్వామినే నమ్ముకుని పనిచేస్తున్న మిగిలిన కార్మికులకు కనీస సౌకర్యాలను కల్పించకపోగా వారికిస్తున్న వేతనాల్లోనూ కోతవిధించారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు. తాజా టిటిడి పారిశుధ్య విభాగంలోని దాదాపు 3,600మంది సులభ్ కార్మికుల జీతాలను రూ.11వేల నుంచి 8వేలకు కుదించినట్లు తెలుస్తోంది. దీంతో ఆగ్రహించిన కార్మికులు ఆదివారం మధ్యాహ్నం నుంచి సమ్మెకు దిగడం గమనార్హం.

కార్మికులపై ఇంత అధర్మమా..?

జి.బాలసుబ్రమణ్యం, సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు



నిత్యం ధర్మాన్ని వల్లించే టిటిడి అధికారులు కార్మికుల పట్ల ఇంత అధర్మంగా వ్యవహరించడం దారుణం. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సాక్షాత్తూ దేశసర్వోన్నత న్యాయస్థానమే ఆదేశించినా టిటిడిలో దాన్ని అమలు చేయకపోవడం సిగ్గు చేటు కాదా?... జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వెంటనే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి. వెంటనే లడ్డూ, దర్శనం కార్డులతో పాటు ఉచిత వైద్యం, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలి. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ వారికి అండగా సిఐటియు నిలుస్తుంది.

కార్మికులకు న్యాయం చేయాల్సిందే..!

ఆర్.లక్ష్మి, శ్రామిక మహిళా నేత, తిరుపతి



కాంట్రాక్టు కార్మికులకు టిటిడి న్యాయం చేయాల్సిందే. లేకుంటే ఉధృత పోరాటం తప్పదు. టిటిడి కార్పొరేషన్‌లో విలీనం చేస్తామంటూ కార్మికులను మభ్యపెడతూ వారి చేత గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నారు. పైగా ప్రస్తుతమిస్తున్న వేతనాల్లోనూ కోత విధిస్తే వారెలా బతకాలి. టిటిడి కాంట్రాక్టు విభాగంలో 80శాతం మహిళలే ఉన్నారు. వారికి అవసరమైన కనీస సౌకర్యాలనూ కల్పించకుండా టిటిడి యాజమాన్యం అమానవీయంగా వ్యవహరిస్తోంది. కార్మికులు కన్నెర్ర చేయకముందే వారికి న్యాయం చేయాలి. లేకుండా తీవ్రపరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది.

నకిలీ వెబ్సైట్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

ఏపీ ఫోరెన్సిక్ సైబర్ సెల్ విచారణ

నకిలీ వెబ్సైట్లను నమ్మవద్దని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానముల పేరుతో గల మరో నకిలీ వెబ్సైట్‌ను టీటీడీ ఐటీ విభాగం గుర్తించి తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎఫ్ఐఆర్ 19/2023 యు/ఎస్ 420, 468, 471 ఐపిసి ప్రకారం పోలీసులు నమోదు చేసి ఎపి ఫోరెన్సిక్ సైబర్‌సెల్‌కు అప్పగించారు. సైబర్ సెల్ అధికారులు నకిలీ వెబ్సైట్‌పై విచారణ ప్రారంభించారు. ఇదివరకే 40 నకిలీ వెబ్సైట్లపై కేసులు నమోదు కాగా, దీంతో కలిపి కేసులసంఖ్య 41కి చేరింది. అధికారిక వెబ్సైట్ https://tirupatibalaji.ap.gov.in ఇలా ఉండగా, చిన్న మార్పులతో కొందరు వ్యక్తులు రూపొందించిన https://tirupatibalaji-ap-gov.org వెబ్సైట్‌ను టిటిడి గుర్తించింది. టీటీడీ అధికారిక వెబ్సైట్లోనే శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, గదులు బుక్ చేసుకోవాలని కోరడమైనది. దీంతో పాటు టీటీడీ అధికారిక మొబైల్ యాప్‌ను టిటిడి దేవస్థానం కూడా వినియోగించవచ్చు.



శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట...

అసాంఘిక శక్తులపై ఉక్కు పాదం...

ప్రత్యేక నిఘా ఏర్పాటు..

విజిబుల్ పోలీసింగ్ తప్పనిసరి..

ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలి...

అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్. అమ్మిరెడ్డి

ప్రజాశక్తి- తిరుపతిసిటి: అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్.అమ్మిరెడ్డి తిరుపతి జిల్లా పి.పరమేశ్వరరెడ్డితో కలిసి జిల్లా పోలీస్ అధికారులతో ప్రస్తుతం జిల్లాల్లో ఉన్న శాంతి భద్రతల నిర్వహణపై మహిళా యూనివర్సిటీ సావేరి సమావేశ మందిరంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఐజి మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తరువాత తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే ఒక పెద్ద జిల్లాగా అవతరించిందని, జిల్లాలో పుణ్యక్షేత్రాలతో పాటు, వాణిజ్య హబ్, షార్ మొదలగు అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఎన్నో విభాగాలు ఉన్నాయని, ఇక్కడ పోలీస్ విధులు కూడా కఠినతరంగా ఒక ఛాలెంజింగ్‌గా ఉంటుందని అన్నారు. విలేజ్, వార్డు పోలీసు ఆఫీసర్ (విపిఓ, డబ్ల్యూపిఓ) వ్యవస్థను బలోపేతం చేసి విపిఓ, డబ్ల్యూపిఓలతోపాటు వారి పరిధిలోగల ఎంఎస్‌కెలతో ప్రతి శనివారం ఉమ్మడి సమావేశం కార్యక్రమాన్ని గంటపాటు నిర్వహించారు. ముందస్తు సమాచారం సేకరణ చేసి, శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, నేర నివారణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఒక్కొక్క సబ్ డివిజన్ ఒక్కొక్క ప్రత్యేకత కలిగి ఉందని, తిరుపతి నగరం మహా పుణ్యక్షేత్రమైనందున ఇక్కడికి భక్తుల తాకిడి కూడా అదే రీతిలో ఉంటుందని, ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలన్నారు.

జాతీయ రహదారులలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి అక్కడ సోలార్ సిగ్నల్ వ్యవస్థను, క్యాటిజెస్, బ్లింకింగ్ స్టడ్‌లను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చోరవ చూపాలన్నారు. మారుతున్న నేరాలకు అనుగుణంగా విజిబుల్ పోలింగ్, బీట్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరిస్తూ, నవీనీకరించి నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై దష్టి సారించి నివారణ చేయాలన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవల వినియోగంపై ప్రజలకు ఎంఎస్‌కె ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పింక్ స్పాట్స్ అయిన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల వద్ద ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ నియంత్రణ, నివారణకు దిశా పోలీసులను, ఎంఎస్‌కెలను ఉపయోగించాలని, తద్వారా దొంగతనాలను నివారించవచ్చని అధికారులను ఆదేశించారు. శేషాచల కొండలు తిరుపతి జిల్లాలోనే ఉన్నందున ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి పెద్దపీట వేయాలన్నారు. అలాగే గాంజా, నాటుసారాను ప్రత్యేక కేసులుగా పరిగణించి వాటి నిర్మూలనపై దష్టి సారించి అడ్డుకట్ట వేయాలన్నారు. అవసరమైతే పిడి యాక్ట్ కేసులను కూడా నమోదు చేసి నివారించాలన్నారు.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ యజమానులతో తరచుగా సమావేశాలు ఏర్పాటు చేసి, వారి హాస్టల్స్ ఎంట్రన్స్, ఎగ్జిట్, రిసెప్షన్, డైనింగ్ హాల్‌ల వద్ద ఖచ్చితంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్స్, పాత నేరస్తులకు తరచుగా కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి, వారి కదలికలపై నిఘా ఉంచి, నేరనివారణ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కులశేఖర్ లా అండ్ ఆర్డర్, విమల కుమారి క్రైమ్, ముని రామయ్య తిరుమల, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, ఎస్బి డిఎస్పి సురేందర్‌రెడ్డి, జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి

అంతర్రాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్లు అరెస్టు

- 13 మంది అరెస్టు
- పరారీలో ఇద్దరు ..
- రూ.71లక్షల విలువగల 21ఎ దుంగలు, ఒక కారు, 6 బైకులు స్వాధీనం



అరెస్టు చేసిన స్మగ్లర్లను మీడియా ఎదుట చూపుతున్న జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): తిరుపతి జిల్లా వెస్ట్ సబ్‌డివిజన్ భాకరాపేట సర్కిల్ ఎర్రవారిపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన 13మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి సుమారు 71లక్షల విలువ గల ఎర్రచందనం దుంగలను, ఒక కారును, 6 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్పీ పి.పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం సాయంత్రం 4 గంటలకు అందిన సమాచారం మేరకు భాకరాపేట సిఐ తులసీరామ్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ప్రకాష్ వారి సిబ్బందితో ఎర్రావారిపాలెం మండలం, బోడెవాండ్లపల్లి గ్రామ సమీపంలోని సాయికాడగుట్ట వద్ద గల ఆంజనేయస్వామి గుడి దగ్గర అంతర్రాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్స్ ముఠాకు చెందిన 13 మందిని అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి సుమారు 71 లక్షల రూపాయల విలువగల 21 ఎర్రచందనం దుంగలు,కారు, 06 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పరారీలో మరో ఇద్దరు ముద్దాయిలు ఉన్నారని వారిని పట్టుకోవడానికి చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. అక్రమ రవాణాలో పట్టుబడిన ముఠా సభ్యులు అనేక పర్యాయాలు శేషాచల అడవులలోకి వచ్చి ఎర్రచందనం దుంగలను నరికి వెళ్లారని, వీరిపై ఇది వరకే కేసులు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీస్తున్నామన్నారు. వీరిలో ఒకరు అన్నమయ్య జిల్లా, ఇద్దరు తిరుపతి జిల్లా, మిగిలిన 10 మంది తమిళనాడు రాష్ట్రం పరిసర ప్రాంతాలకు చెందిన ముఠా సభ్యులుగా గుర్తించడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలు తమిళనాడు రాష్ట్రానికి చెందినవి, ఆంధ్రప్రదేశ్లోకి రాగానే ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ కలిగిన వాహన నెంబర్ ప్లేట్లను వేసుకొని, ఎవరికి అనుమానం రాకుండా ద్విచక్ర వాహనాల్లో ఇద్దరు ఇద్దరుగా మాత్రమే తిరిగేవారని, అయినా కూడా పోలీస్ అధికారులు సిబ్బంది ఎంతో చాకచక్యంగా వ్యవహరించి ఒక పథకం ప్రకారం పట్టుకోవడం జరిగిందన్నారు. పారిపోయిన ముద్దాయిలిద్దరూ అంతరాష్ట్ర స్మగ్లర్లే అని, ఎర్రచందనం కూలీలను శేషాచలం అడవులకు తీసుకొని వచ్చి, ఎర్రచందనం చెట్లను నరికి, చెన్నై బెంగళూరులోని బడా స్మగ్లర్లకు దుంగలను సరఫరా చేసేవారని విచారణలో తేలిసిందన్నారు. పరారీలో ఉన్న ముద్దాయిని పట్టుకోవడానికి ప్రత్యేక బందాలను కూడా ఏర్పాటు చేసి విస్తతంగా గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను కట్టడి చేయడానికి ప్రత్యేకమైన నిఘా వ్యవస్థ బందాన్ని ఏర్పాటు చేశామని, మరింత సమాచారం కోసం ఇతర రాష్ట్రాల్లో కూడా నిఘా ఉంచడం జరిగిందన్నారు. శేషాచలం సంపదను కాపాడుకోవడం మన విధి, అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించేది లేదని ఇప్పటికే ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ ద్వారా మరిన్ని దాడులు నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ ఉన్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎల్అండ్ఓ కులశేఖర్, క్రైమ్ విమల కుమారి, డిఎస్‌పిలు సురేంద్ర రెడ్డి ఎస్బి, నరసప్ప వెస్ట్, కొండయ్య కమాండ్ కంట్రోల్, భాకరాపేట సిఐ తులసీరామ్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ప్రకాష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి ఘాట్ రోడ్డులో కారు బోల్తా

స్వల్పగాయాలతో బయటపడ్డ శ్రీవారి భక్తులు

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన టిటిడి సిబ్బంది



ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తుల కారు తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదం జరిగింది. తిరుమల మొదటి ఘాట్‌రోడ్డు 33వ మలుపు వద్ద ఆరుగురితో ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టి బోల్తా పడింది. ఘాట్‌రోడ్డు పక్కన లోతు తక్కువగా ఉండటంతో వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన ఇతర ప్రయాణికులు ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది క్షతగాత్రులను కారు నుంచి బయటికి తీసి ఆస్పత్రికి తరలించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దర్శనమయ్యాక తిరుగు ప్రయాణంలో ఈప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలపై నిరంతర పోరాటం

ప్రైవేట్ సెక్యూరిటీ యాజమాన్యాల సంఘం బలోపేతానికి కృషి : ఏపీపీఎస్ఎంఏ నేతల వెల్లడి



ప్రజాశక్తి- తిరుపతి: రాష్ట్రంలోని ఏపీ ప్రైవేట్ సెక్యూరిటీ యాజమాన్యాల సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తామని, అలాగే సంఘం బలోపేతానికి కృషిచేస్తామని ఏపీపీఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.గోపాల్ పేర్కొన్నారు. తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని ఓ ప్రయివేట్ హోటల్ భవనంలో ప్రైవేటు సెక్యూరిటీ యాజమాన్యాల సంఘం రాష్ట్రస్థాయి సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వనాథం, గోపాల్‌లు మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఆయా సెక్యూరిటీ యాజమాన్యాలు, సెక్యూరిటీ గార్డులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. సెక్యూరిటీ గార్డులకు అందించాల్సిన వేతనాలు, ఇతర సౌకర్యాలపైనా చర్చించారు. అలాగే యాజమాన్యాల లైసెన్సులు పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, ఆ సమస్యల పరిష్కారం దిశగా కృషిచేయాలని, ప్రైవేట్ సెక్యూరిటీ యాజమాన్యాల సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సెక్యూరిటీ సంస్థలకు చెల్లింపుల్లో గల తేడాలు, క్లయింట్ల నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనడంపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర గౌరవఅధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు, ఈసీ మెంబర్లు శ్యామ్, రమేష్, రాము, బాలాజీ, రామ్ సుందర్, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, శివాజీ, సదస్సు ఆర్గనైజర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు

పిఎసి-1 వద్ద ఫుడ్ కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుమల: కరోనా కారణంగా మూతపడ్డ ఫుడ్ కౌంటర్ టిటిడి తిరిగి ప్రారంభించింది. టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి ఆదేశాల మేరకు తిరుమలలో సామాన్య భక్తుల సౌకర్యార్థం పిఎసి-1 వద్ద ఆదివారం ఫుడ్ కౌంటర్‌ను ప్రారంభించారు. టిటిడి అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ కౌంటరులో ముందుగా శ్రీవారి చిత్రపటానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల పంపిణీని ప్రారంభించారు. ఇక్కడ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30గంటల వరకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తారు. పిఏసి-1లో బసచేసే సామాన్య భక్తులకు ఈ ఫుడ్ కౌంటర్ సౌకర్యవంతంగా ఉంటుంది. వెంగమాంబ అన్నప్రసాద భవనంతో పాటు పాత అన్నదానం కాంప్లెక్స్, పిఏసి-2లో అన్నప్రసాద వితరణ జరుగుతోంది. వీటితోపాటు రాంభగీచా బస్టాండ్, కేంద్రీయ విచారణ కార్యాలయం వద్ద ఫుడ్‌కౌంటర్లు ఉన్నాయి. దీంతో కలిపి మొత్తం ఫుడ్‌కౌంటర్లు మూడుకు చేరాయి. రిసెప్షన్ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ఏఈఓ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



ప్రజాశక్తి-గూడూరు: రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన టిడిపి సెల్‌ఫోన్ యాప్ ప్రతిఒక్క క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లు తప్పక డౌన్‌లోడ్ చేసుకొని టిడిపి పార్టీ చేసే కార్యక్రమాలను యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. సాంకేతిక యాప్‌లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యాచేంద్రనాయుడు, భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వరరాజు, రహీం తదితరులు పాల్గొన్నారు.

జై భారత్ సత్యాగ్రహ యాత్రను జయప్రదం చేయాలి



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డి.సి.సి. అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి పిలుపుమేరకు గూడూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పరిమళ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బీజేపీ నిరంకుశ పాలనకు నిరసనగా ఈనెల 24వ తేదీన విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే జై భారత్ సత్యాగ్రహ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం గూడూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జై భారత్ సత్యాగ్రహ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరిమళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంట్లో అధికార పార్టీ బి.జె.పి. వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడిచే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో గూడూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మెదూరు శ్రీనివాసాచారి, గూడూరు మండల అధ్యక్షురాలు మాదాల రమాదేవి, మహబూబ్ భాషా, అహ్మద్ బాషా, మణి, ముని తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం




ప్రజాశక్తి-గూడూరు టౌన్: మానవత స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో రాపూరు రోడ్డులోని రాజమాత బస్‌షెల్టర్ వద్ద పల్లంపర్తి మౌర్య ప్రతాప్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రాజమాత వాటర్స్ సహకారంతో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు కలికి జనార్ధన్‌రెడ్డి, చేవూరు విజయమోహన్ రెడ్డి, మానవత ఛైర్మన్ బుస్సారెడ్డి దశరథరామిరెడ్డి, కంటి రామమోహన్ రావు , రోటరీ క్లబ్ అధ్యక్షులు కిరణ్ కుమార్, మంజులమ్మ. మర్ఫీ ప్రసాద్, విజయ, దామోదర్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, పెనుమాది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నాగాలమ్మ ఆలయ జీర్ణోద్ధరణ కుంభాభిషేకం



ప్రజాశక్తి- పిచ్చాటూరు: పిచ్చాటూరు టీచర్స్ కాలనీలోని శ్రీ నాగాలమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పుష్కర కుంభాభిషేకం ఆదివారం వేడుకగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలత దంపతులు, ఎమ్మెల్యే కోనేటి అదిమూలంలకు ఎంపీపీ రేఖాహరిశ్చంద్రారెడ్డి దంపతులు స్వాగతం పలికారు. పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రామాపురంలోని సచివాలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అహర్నిశలు కష్టి చేస్తోందన్నారు. నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాలు 90 శాతం అమలు చేసినట్లు చెప్పారు. టీడీపీ నాయకులు రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల పంపిణీ చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కె.వి.భాస్కర్‌నాయుడు, జడ్పీటీసీ విష్ణుప్రియ, సర్పంచ్ కె.జి.రోస్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయమ్మ, ఎంపీటీసీ రమేష్ రాజు, బీరేంద్రవర్మ, సుశీల్ కుమార్‌రెడ్డి, గోవిందన్ ప్రతాప్ రెడ్డి, భూపతి, పురుషోత్తంరెడ్డి, నిరంజన్‌రెడ్డి, నాయుడు, దయాకర్‌రెడ్డి, వేలు, మాధవి, బాబు రెడ్డి, చెంగల్రాయులురెడ్డి, తొప్పయ్య, పాల పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

నేడు సోమనాథేశ్వరాలయ కుంభాభిషేక ఉత్సవాల ప్రారంభం



ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజుకండ్రిగలో శ్రీ పార్వతీ సమేత సోమనాథేశ్వరాలయ కుంభాభిషేక ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని శ్రీ లక్ష్మీగణపతి హనుమంతేశ్వర దేవస్థానం కమిటీ వెల్లడించింది. ఇందుకు అవసరమైన ప్రత్యేక హోమ మండపం, ఏర్పాట్లు చేపట్టారు. రూ.2 కోట్ల దాతల విరాళాలతో సుమారు పదేళ్లపాటు ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణంలో గ్రామానికి చెందిన జ్యోతిరాజు, అతని కుటుంబ సభ్యులు కీలకపాత్ర పోషించారు. కుంభాభిషేకం పూజల్లో తొలిరోజు మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు కుటుంబ సభ్యులు అన్నదానం చేయనున్నారు. 25న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొనున్నారు. 27న విమాన గోపుర కలశాలకు శ్రీకాళహస్తి శుక బ్రహ్మ శిష్యులు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములుచే మహాకుంభాభిషేకం జరుగనుంది. అదే రోజు సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, రాత్రి గ్రామోత్సవం జరగనుంది. 28న సీతారాముల కళ్యాణం, 29న శ్రీవల్లీ దేవసేన సుబ్రమణ్యస్వాముల కళ్యాణం నిర్వహిస్తారు. కుంభాభిషేకం కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

అన్నార్థులకు ఆపన్నహస్తం..!



710 రోజులుగా యాచకులకు అన్నదానం

అనాథుల ఆకలి తీరుస్తున్న ఓ వాలంటీరు

సేవా మిత్ర రూరల్ ఫౌండేషన్ పేరుతో సాయం

ప్రశంసలు అందుకుంటున్న బాలాజీ

ఓ పేద కుటుంబానికి చెందిన ఓ యువకుడు నిర్భాగ్యుల ఆకలి తీరుస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు. సుమారు రెండేళ్ల నుంచి నిరంతరాయంగా ఉదయం, మధ్యాహ్నం అన్నదానం చేస్తూ అన్నార్థులకు ఆపన్నహస్తంగా నిలుస్తున్నాడు పుత్తూరు మండలం వీఎస్ఎస్‌పురం గ్రామానికి చెందిన వాలంటీరు బాలాజీ. అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు.

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

పుత్తూరు మండలం తడుకు పంచాయతీ వీఎస్ఎస్ పురం గ్రామంలోని ఓ నిరుపేద కుటుంబానికి చెందిన వేలాయుధం, లక్ష్మీకాంతమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు బాలాజీ. తల్లిదండ్రులు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. బాలాజీ ఇంటర్ చదువుతుండగానే తండ్రి వేలాయుధం మరణించాడు. అప్పటినుంచి తల్లి కూలీ పనులు చేస్తూ కుమారుడిని డిగ్రీ వరకు చదివించింది. ఆ తరువాత తల్లికి చేయూతగా ఉండాలన్న ఉద్దేశంతో బాలాజీ చుట్టుపక్కలా క్యాటరింగ్ పనులు, కరెంటు పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో ఊళ్లోనే వాలంటీరుగా అతడికి అవకాశం కల్పించడంతో ఓ వైపు గ్రామస్థులకు 'సచివాలయ' సేవలు అందిస్తూనే.. మరో వైపు రాత్రి వేళల్లో క్యాటరింగ్ పనులతోపాటు వాటర్ ప్యూరిఫైయర్ యంత్రాల మరమ్మతులు.. ఎలక్ట్రిషియన్ చిన్నపాటి పనులు చేసుకుంటూ అమ్మకు ఆసరాగా నిలుస్తున్నాడు.

ఆకలి బాధలు దూరం చేస్తూ..!

యాచకులు.. అనాథలు.. నిరుపేదల ఆకలి బాధలను గమనించిన బాలాజీ వారికి సాయం అందించాలన్న తపనతో 'సేవామిత్ర రూరల్ ఫౌండేషన్' పేరుతో గత రెండేళ్ల క్రితం సేవా కార్యక్రమాలు ప్రారంభించాడు. వారికి రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందించాలని నిశ్చయించుకున్నాడు. రోజూ 30 నుంచి 40 మందికి అన్నదానం చేస్తూ వస్తున్నాడు. కరోనా కాలంలో తన సేవలను ప్రారంభిన యువకుడు బాలాజీ ఆ యజ్ఞాన్ని కొనసాగిస్తూ నేటికి 710 రోజులకు పైగా నిరాటంకంగా తన సేవలను కొనసాగిస్తున్నాడు. అలాగే కరోనా కాలంలో గొల్లపల్లె, వీఎస్ఎస్ పురం, టీఆర్ కండ్రిగ, తడుకు ప్రాంతాల్లోని నిరుపేద గిరిజన కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, వంట సామగ్రిని అందించి స్థానికంగా అందరి మన్ననలు పొందుతన్నాడు. బాలాజీ తనకు ప్రతినెలా అందే వాలంటీరు గౌరవ వేతనం రూ.5 వేలు సైతం అన్నదానం కోసమే ఉపయోగిస్తున్నాడు. అలాగే వాలంటీరుగా సేవలు గుర్తించిన ప్రభుత్వం అందించిన ప్రోత్సాహక బహుమతి రూ.10 వేలు అన్నార్థుల సంక్షేమానికి అందిస్తున్నాడు. 2022 డిసెంబర్‌లో యాచకుల కోరిక మేరకు చలిని తట్టుకునేలా దుప్పట్లు పంపిణీ చేశాడు.

ఆకలి చావులు కళ్లారా చూసా..!

నేను నిరుపేద కుటుంబంలో పుట్టాను. పేదరికం చూశాను. అమ్మ కష్టాన్ని కళ్లారా చూశాను. తనను చదివించేందుకు అమ్మ పడ్డ కష్టం నన్ను ఎంతగానో చలింపజేసింది. అన్నం కోసం కల్యాణ మండపాల వద్ద ఎగబడే వారిని చూశాను. అప్పుడే పదిమందికీ సాయం చేయాలని నిర్ణయించుకున్నాను. అమ్మను పోషించుకుంటూనే రోజూ నా సాయం కోసం ఎదురు చూసే 30 నుంచి 40 మంది యాచకులకు అన్నం పొట్లాలు అందిస్తున్నాను. ఇది నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

- బాలాజీ, వీఎస్ఎస్ పురం, తడుకు పంచాయతీ పుత్తూరు మండలం



ప్రచార ఆర్భాటాలకే సరి..!




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, ఈ నాలుగేళ్ల ప్రచారాల ఆర్భాటాలతోనే సరిపెట్టేశారని వైసీపీ ప్రభుత్వం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటా వినుత విమర్శించారు. ఆదివారం ఆమె నేనూ-నా నియోజకవర్గ ప్రజలు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. ఎక్కడికెళ్లినా అభివృద్ధి శూన్యమని, అయితే స్థానిక ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నాడని విమర్శించారు.

అకాల వర్షానికి పంటలకు దెబ్బ




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అకాల వర్షానికి వచ్చిన పూత పూర్తిగా రాలిపోయింది. అనంతరం అక్కడక్కడ కాసిన మామిడి కాయలు రాలిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుత్తూరు మండలంలోని తొరూరు, తడుకు, శిరుగురాజపాలెం తదితర గ్రామాలలో కోతకు వచ్చిన వరిపైరు సైతం నేలవాలింది.

రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి-క్యాంపస్: టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో శ్రీ రామానుజాచార్యులవారి అవతార మహోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి మంగళ శాసనాలు అందించారు. ఆదిశేషుని అవతారమైన భగవద్ రామానుజులు శరణాగత భక్తిని విశేషంగా ప్రచారం చేశారని ఆయన తెలిపారు. శ్రీమహావిష్ణువుకు ఆదిశేషుడు పాన్పుగా, ఆసనంగా ఉంటూ ప్రథమ సేవకుడిగా నిలిచాడని, భగవద్ రామానుజులు ఈ మార్గాన్నే అనుసరించారని వివరించారు. రామానుజార్యుల అవతార మహోత్సవాలను టీటీడీ ఘనంగా నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. తిరుపతికి చెందిన ఆచార్య రాజగోపాలన్ "శ్రీరామానుజ వైభవం" పై ఉపన్యసించారు. ఆ తరువాత అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రేవతి బృందం ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఏఈఓ రాములు, కో-ఆర్డినేటర్ పురుషోత్తం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

14 నుంచి వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ పోటీలు



ప్రజాశక్తి- తిరుపతిసిటీ: చంద్రగిరి నియోజకవర్గంలోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీయడంతో పాటు యువతలో స్నేహభావాన్ని పెంచడానికై మే 14వ తేదీ నుంచి వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. తుమ్మలగుంటలోని ఆయన నివాసం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్ఫూర్తితో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిల సహకారం వల్ల గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. పంచాయతీల నుంచి ఎంత మంది క్రీడాకారులు అయినా పోటీలో పాల్గొనవచ్చునని, 17 సంవత్సరాల వయస్సు దాటిన వారికి మాత్రమే అవకాశం వుంటుందన్నారు. ఏ పంచాయతీకి చెందిన వారు ఆపంచాయతీ తరపున మాత్రమే ఆడాలన్నారు. అలాగే ఒక టీమ్‌లో ఆడిన వారు మరొక టీమ్ లో అడటానికి వీలు లేదని, పోటీల్లో పాల్గొన దలచిన వారు వారి వయస్సు, చిరునామా ధ్రువీకరణకు సంబంధించిన పత్రాలు (ఆధార్, విద్యార్హత సర్టిఫికేట్లు) తప్పని సరిగా దరఖాస్తు ఫారానికి జతచేయాలన్నారు. ఎమ్మెల్యే కార్యాలయాల్లో ఏప్రిల్ 25 నుంచే దరఖాస్తుల స్వీకరణ అని చెప్పారు. వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన దలచిన క్రీడాకారులు 11మంది ఒక టీమ్‌గా ఏర్పాటై ఏప్రిల్ 25వ తేదీ నుంచి నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యే కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు చిరునామా, వయస్సు ధ్రువీకరణ పత్రాల నకల్లును తప్పనిసరిగా జత చేయాలని, పోటీల్లో పాల్గొనడానికి ఏలాంటి ప్రవేశ రుసుము వసూలు చేయడం లేదని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వివరించారు. అలాగే పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్క క్రీడాకారునికి నాణ్యమైన టీషర్ట్‌తో పాటు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే టోర్నమెంట్ లో పాల్గొనే ప్రతి టీమ్ ఉచితంగా క్రికెట్ కిట్ ను అందించడం జరుగుతుందని వెల్లడించారు. వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొని మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండవ బహుమతిగా రూ.50వేలు, మూడవ బహుమతిగా రూ.25 వేలు, నాలుగవ బహుమతిగా రూ.10వేలు ఇవ్వనున్నట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.5లక్షలు, రెండవ బహుమతిగా రూ.3లక్షలు, మూడవ బహుమతిగా రూ.2లక్షలు, నాలుగవ బహుమతిగా రూ. లక్ష నగదును ఇవ్వనున్నట్లు చెప్పారు. వీరితో పాటు టోర్నమెంట్‌లో ప్రతిమ్యాచ్‌కు బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్ మెన్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మెమెంటోలు ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు అందరూ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రాధాన్యతనిచ్చే పార్టీకే వడ్డెర్ల మద్దతు



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీకే వడ్డెర్లు మద్దతు ఇస్తారని ఆ కుల సంఘం నేతలు ప్రకటించారు. తరతరాలుగా సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ రంగాల్లో వెనుకబడిన వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చడానికి అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణం గోపాలవనంలో గల విశ్వభారతి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం తిరుపతి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. తిరుపతి జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కమిటీ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర్లు 40లక్షల మందికి పైగా ఉన్నారన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా వడ్డెర్లు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెర్లు అభివృద్ధి చెందాలంటే చట్ట సభల్లో అవకాశం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న జనాభా దామాషా ప్రకారం వడ్డెర్లకు ఐదు ఎమ్మెల్యే, రెండు పార్లమెంటు సీట్లు కేటాయించాలని వారు డిమాండు చేశారు. ఈ ప్రాతిపదికన ఏ రాజకీయ పార్టీ ముందుకు వస్తుందో వారికి వడ్డెర్లు అందరం అండగా నిలుస్తామని వారు హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర వడ్డెర జేఏసీ ఛైర్మన్ వేముల సుబ్బారావు, వైస్ ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు తురక అమరనాథ్, ప్రధాన కార్యదర్శి కోనంగి శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంటు మల్లి శ్రీనివాసులు, కార్య నిర్వాహక కార్యదర్శి దేరంగుల శ్రీధర్, ఉపాధ్యక్షులు వలిపి శ్రీరాములు, సంఘం నేతలు విజయకుమార్, తేపల్లె విజయ్ శ్రీనివాస్, జెరిపిటి జయరాం, గుంజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని చక్కదిద్దగల సమర్థులు చంద్రబాబే: నాని



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని ఈ పరిస్థితుల నుండి రాష్ట్రాన్ని చక్కదిద్దగల సమర్థులు ఒక్క చంద్రబాబు నాయుడేనని చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. ఆదివారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమంలో భాగంగా 11వ రోజు మంగళం క్వార్టర్స్ లో నాని పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలు ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలను చూసి, రానున్న ఎన్నికల్లో టీడీపీకి పట్టం కడితే చంద్రబాబు పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండడంతోపాటు సంక్షేమపథకాలు అందుతాయన్నారు. టీడీపీ అమలు చేసిన పలురకాల పథకాలు, కానుకలను వైసీపీ ప్రభుత్వం తొలగించి, పేదలను పండగలకు దూరం చేస్తోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ముస్లిం మైనార్టీలలో వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని పులివర్తి నాని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య, గోపీనాథ్, భాస్కర్ రెడ్డి, సురేష్ నాయుడు, చలపతి, కష్ణమూర్తి రెడ్డి, ఆర్కే నాయుడు, జ్యోతి, జనార్ధన్, సుధాకర్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ మరోమారు తమ దాతత్వాన్ని చాటుకొంది. ఈట్రస్ట్ వ్యవస్థాపకరాలు తహసున్నిసా బేగం వికలాంగులకు పేదముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేశారు. దాదాపు 20 మంది వికలాంగులకు, 20మంది పేదముస్లిం కుటుంబాలకు, మరో 20మంది ఎస్టీ కాలనీ ప్రజలకు ఉయ్ సపోర్ట్ వ్యవస్థాపకురాలు తహసున్నిసా బేగం 10 నిత్యావసర వస్తువులతో కూడిన రంజాన్ తుఫాను అందజేశారు. ఆదివారం స్థానిక లీలామహల్ కూడలి వద్ద ఓ ప్రైవేటు హోటల్ నందు విరందరికి ఈకానుకలను అందజేసి భోజనాలు పంపిణీ చేశారు. అంతకుముందు ఏర్పాటుచేసిన సభలో 38వ డివిజన్ కార్పొరేటర్ నరేంద్రనాథ్, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, మాధవ్, పెంచలయ్య, ఉయ్ సపోర్ట్ సభ్యులు శ్రీలత, లక్ష్మీ, సంధ్య, సుజాత, కవిత తదితరులు పాల్గొన్నారు.

కాదలూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రజాశక్తి-తడ: తడ మండలంలోని కాదలూరు గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కె.రఘు రెడ్డి, బీసీసెల్ అధ్యక్షులు మునస్వామిరెడ్డి, సుందరరెడ్డి, బి.వి.పాళెం, రత్నం , తడ సర్పంచ్ ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి



ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులు చదువులతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించే విధంగా సేవా భావాలను అలవర్చుకొని పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య జె కాత్యాయని పిలుపునిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి ఎన్ఎస్ఎస్ యూనిట్ -15 దత్తగ్రామమైన దుర్గసముద్రంలో 17 నుండి 23 వరకు ఇంజినీరింగ్ ఈసీఈ విభాగం వాలంటీర్లు, ప్రోగ్రామ్ అధికారిణి డా. డి. యువశ్రీ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఏడవ రోజున దుర్గసముద్రం గ్రామంలో ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఎమ్. ప్రసాద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో -ఆర్డినేటర్ ఆచార్య జె. కాత్యాయని, ఈసీఈ కో-ఆర్డినేటర్ బి. మాధవి విచ్చేశారు. ఆచార్య జె. కాత్యాయని మాట్లాడుతూ గ్రామాభివద్ధికి తోడ్పడేలా ఏదైనా ఎలక్ట్రానిక్ పరికరాన్ని తయారుచేయమని ఈసీఈ విద్యార్థులకు సలహా ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు బాలికల గురుకుల కళాశాలలో ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గురుకులంలో జరిగిన పరీక్షలకు 152 మంది హాజరు కావాల్సి ఉండగా.. 131 మంది హాజరైనట్లు పరీక్షల పరిశీలకులు ఎంఈవో రవి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రసూన పర్యవేక్షించారు.

IN THE COURT OF THE V ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
O.S.No. 44/2017
N. Mangammal ...Plaintiff
V/s
K. Rosamma and 28 others ...Defendants
SUIT SUMMONS TO THE DEFENDANT Nos. 19, 20, 22 TO 29
D19)M. Govindamma, W/o late M. Krishna Reddy, Mundlapudi Village and post, Tirupati Rural mandal, Tirupati district
D20)Janaki, W/o. late Palani, D/o. late M. Krishna Reddy, Gundluru, Tiruttani town and taluk, Thiruvalluru district, Tamilnadu State
D22) M. Janakiramana, S/o late M. Krishna Reddy, Mundlapudi village and post, Tirupati Rural mandal
D23)M. Gopi, S/o. late M. Krishna Reddy, Mundlapudi village and post, Tirupati Rural mandal, Tirupati district
D24)M. Radhamma, W/o. late M. Chinnabba Reddy, Mundlapudi village and post, Tirupati Rural mandal, Tirupati district
D25)M. Bhakthi, D/o. late M. Chinnabba Reddy, near R.K.Kalyanamandapam Saibaba temple street, Tiruchanur, Tirupati Rural mandal, Tirupati district
D26)M. Munaswamulu, S/o. late M. Chinnabba Reddy, Mundlapudi Village and post, Tirupati Rural mandal,
D27)Ammulu, W/o. Mallasam, D/o. late M. Chinnabba Reddy, Mundlapudi village and post, Tirupati Rural mandal, Tirupati district
D28)M. Nagaraj, S/o. late M. Chinnabba Reddy, Mundlapudi village and post, Tirupati Rural mandal, Tirupati district
D29)Mangamma,W/o. Venktesan.D/o. late M. Chinnabba Reddy, Senji Panapakam.Tiruvalamgadu post, Thiruvalluru district, Tamilnadu State
Madam/Sir,
WHERE AS the plaintiff has instituted the above suit against you and others to divide the suit schedule mentioned properties in to two equal shares and allot one such share to the plaintiff, You are hereby summoned to appear before the above said court on **28-04-2023** at 10-30 A.M. either in person or through your pleader, in default of your appearance on 28-04-2023 before the above saidcourt, the above suit will be heard and determined in your absence.
Hearing Date: On 28-04-2023
B. NARAHARI REDDY, M.A., LLB.,
R. PADMAJA, B.Sc., M.L.
Advocates for plaintiff TIRUPATI